www.prajasakti.com
# ప్రజాశక్తి
బుధవారం 29 అక్టోబర్ 2025
5
వైఎస్ఆర్

## వైవీయూకు సహకారం అందించాలి : విసి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

వైవీయూకు సహాయ సహకారాలు అందించాలని యోగివేమన విశ్వవిద్యాలయం విసి ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి (ఎపిఎస్‌సిహెచ్) ఛైర్మన్ ఆచార్య కె. మధు మూర్తిని కోరారు. వైవీయూ విసిగా బాధ్యతలు తీసుకున్నాక తొలిసారిగా మంగళవారం విజయవాడలోని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఛైర్మన్‌కు పుష్ప గుచ్ఛం అందజేసి విశ్వవిద్యాలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఎపిఎస్‌సిహెచ్ పూర్తిగా వెన్నంటి ఉంటుందని ఛైర్మన్ భరోసా ఇచ్చారు. అనంతరం ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ ఎస్. విజయభాస్కరరావు, కె రత్నశైలా మణిని, సెక్రటరీ బి.తిరుపతిరావును కలసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

# జడివాన

జలకళను సంతరించుకున్న మైలవరం ప్రాజెక్టు

**అల్పపీడనం నుంచి తెరిపిన పడకముందే మొంథా తుపాన్ రావడంతో కడప, అన్నమయ్య జిల్లాలను వణికించింది. మంగళవారం ఉదయం నుంచి ఆకాశానికి దారం కట్టిన చందంగా ఏకధాటిగా నాన్పుడు వర్షం కురిచింది. ఉభయ జిల్లాల వ్యాప్తంగా వాగులు, వంకలు ఉధృతంగా ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలోని వెలిగల్లు రిజర్వాయర్ నుంచి 175 క్యూసెక్కులు, గండికోట జలాశయం నుంచి 5,000 క్యూసెక్కులను విడుదల చేశారు. కడప, అన్నమయ్య జిల్లాల్లోని వరి, టమోటా, కందులు, మినుములు, మొక్కజొన్న తదితర పంటల్లోకి వర్షపునీరు గణనీయంగా చేరింది. ఫలితంగా ఉభయ జిల్లాల్లో వేలాది ఎకరాల్లో టమోటా మచ్చల బారిన పడడం, కోత దశలోని వరి, మొక్కజొన్న పంటలు నేలకొరగడం ఆందోళన కలిగిస్తోంది. రబీలో విత్తిన విత్తనం తుపాన్ ప్రభావంధాటికి మొలకెత్తని వాతావరణం కనిపిస్తోంది. ఉభయ జిల్లాల అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వ్యవసాయదారులకు సూచనలు ఇవ్వడంతోపాటు అన్నమయ్య, కడప జిల్లా అధికార యంత్రాంగం 212 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టాలు వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకుంది**

- వరి, టమోటా, మినుములపై ఎఫెక్ట్
- వెలిగల్లు, గండికోట ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత
- 212 పునరావాస కేంద్రాలు ఏర్పాటు
- అప్రమత్తమైన జిల్లా యంత్రాంగం

కడప : నిండుకుండలా ఉన్న బుగ్గవంక డ్యామ్

**ప్రజాశక్తి - కడప ప్రతినిధి**

.కడప, అన్నమయ్య జిల్లాల్లో మొంథా తుపాన్ తీవ్ర ప్రభావం చూపించింది. రెండు రోజులుగా కురుస్తున్న జడివాన కురుస్తోంది. ఫలితంగా జిల్లాలోని వాగులు, వంకలు ఉప్పొంగాయి. వెలిగల్లు, గండికోట రిజర్వాయర్లు జలకళను సంతరించుకున్నాయి. వెలిగల్లు నుంచి 175 క్యూసెక్కులు పాపాఘ్నిలోకి, గండికోట నుంచి 5,000 క్యూసెక్కులు, బుగ్గవంక నుంచి గేట్ల ద్వారా నీటిని పెన్నాలోకి విడుదల చేశారు. అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రాజంపేట, మదనపల్లి రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 30 మండలాల్లో జల్లులతో కూడిన వాన కురిసింది. రాజంపేట డివిజన్ పరిధిలోని పెనగలూరులో 26 మి.మీ, చిట్వేలిలో 16,6, లక్కిరెడ్డిపల్లిలో 15 , నందలూరు 14.8 మి.మీ అత్యధిక వర్షపాతం నమోదైంది. పెనగలూరులో అత్యధికంగా 26 మి.మీ, వర్షపాతం నమోదైంది. పోలీస్, రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తమైంది. నదులు, వాగుల, వంకల దగ్గర పోలీసులను మోహరించింది. అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూము, టోల్‌ఫ్రీ నెంబర్లను ఏర్పాటు చేసింది. అన్నమయ్య, కడప జిల్లాలో కడప, జమ్మల మడుగు, పులివెందుల, బద్వేల్ రెవెన్యూ డివిజన్ల పరిధిలో 212 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసింది. 84 తీవ్ర ప్రభావిత గ్రామాలను గుర్తిం చింది. ఇందులోని 65,237 మందిలో 56,803 మంది ప్రభావితం కానున్నట్లు అంచనా వేసింది. వీరిలో 17,060 మందిని తరలించ నున్నట్లు ప్రణాళికను సిద్ధం చేసింది.

**కాశినాయనలో 58.8 మి.మీ**

బద్వేల్ డివిజన్‌లో అత్యధిక వర్షపాతం నమోదైంది. కాశినాయన 58.8 మి.మీ, బి.కోడూరులో 48, గోవపరంలో 49.2, పోరుమామిళ్ల 45 , బద్వేల్‌లో 44, కలసపాడు 42, బి.మఠంలో 40.4 మి.మీ వర్షపాతం నమోదైంది. రబీ సీజన్ పంటలైన బుడ్డ శనగ, వేరుశనగ, మినుములు, పత్తి, సోయామీన్ పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉందనే అంచనా వేస్తున్నారు. ఉభయ జిల్లాల్లోని రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి, నియోజకవర్గాల్లో పండ్లతోటలతో సహా వేరుశనగ, పత్తి పంటలను పెద్దఎత్తున సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ నిరాశ కలిగించిన నేపథ్యంలో తాజాగా ఏర్పడిన తుపాన్ రబీ సీజన్‌కు కలిసి వచ్చే అవకాశంపై ఆశలు పెంచు కున్న నేపథ్యం నిరాశను మిగిల్చింది.

**బుడ్డశనగ సాగు ప్రశ్నార్థకం!**

జిల్లాలోని 26 మండలాల్లో బుడ్డశనగ సాగవుతోంది. కడప జిల్లాలో రబీ సీజన్‌లో బుడ్డ శనగ, వేరుశనగ, పత్తి, మినుము, సోయాబీన్ ప్రధాన పంటలు. గతేడాది తరహాలోనే బుడ్డశనగ 2,32,360 ఎకరాలు, మినుము 22,915 ఎకరాల్లో గణనీయంగా సాగు కానుంది. వేరుశనగ, పత్తి, సోయాబీన్ గణనీయమైన సంఖ్యలో సాగుతుండడం తెలిసిందే. ప్రతి ఏటా అక్టోబర్ ఒకటి నుంచి ఆశాజనకంగా వర్షపాతం నమోదు కావడం తెలిసిందే. రెండ్రోజుల కిందటి నుంచి బంగాళా ఖాతంలో తుపాన్ ప్రభావం కొనసాగుతున్న నేపథ్యంలో ఏమేరకు ఉపకరిస్తుందో వేచి చూడాల్సి ఉంది.

కడప : బుగ్గవంక డ్యామ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

### బుగ్గవంక ప్రాజెక్టును పరిశీలించిన కలెక్టర్

**ప్రజాశక్తి - కడప**

మంగళవారం మొంథా తుపాను పరిస్థితుల నేపథ్యంలో కడప నగర సమీపంలోని బుగ్గవంక ప్రాజెక్టును మంగళవారం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పరిశీలించారు. రిజర్వాయర్‌లో నీటిమట్టం, ప్రాజెక్టు గేట్లు, బండ్‌ల భద్రతను పరిశీలించి తుపాను ప్రభావ పరిస్థితులపై అప్రమత్తత, నీటి సామర్థ్యం, నీటి విడుదల తదితర అంశాలపై ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులకు అపలు సూచనలు ఇచ్చారు. ప్రాజెక్టు పరిశీలనలో కలెక్టర్‌తో పాటు మేయర్ ముంతాజ్ బేగం, కమిషనర్ మనోజ్ రెడ్డి, ఇరిగేషన్ ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

**ఇటుకలపాడులో కూలిన పాత మిద్దె**

**ప్రజాశక్తి-కాశినాయన**

మండల పరిధిలోని ఇటుకుల పాడులో ఓ మట్టి మిద్దె వర్షం కారణంగా మంగళవారం పైకప్పు కొంత భాగం కూలి పడింది. ఆ సమ యంలో ఇంట్లో ఎవరు నివాసం లేకపోవడంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభ వించలేదు. విషయం తెలుసుకున్న తహశీల్దార్ వెంకట సుబ్బయ్య, పోలీసులు, వ్యవసాయాధికారులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు.

**ప్రజాశక్తి - మైదుకూరు రూరల్** :మండలంలోని నంద్యాలంపేట పంచాయతీ మూడుమాళ్ల గ్రామంలో కురుస్తున్న భారీ వర్షాలకు నిరుపేద మహిళ కోరిగం ఓబుళమ్మ ఇంటి గోడ కూలింది. భర్త మరణించిన తర్వాత బాధితురాలు కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటోంది . వారికి ప్రస్తుతం నిలువనీడ కూడా లేకుండా పోయింది. వర్షానికి తడుస్తూ ఇబ్బంది పడుతున్నారు. నిలువనీడ కోల్పోయి వర్షానికి తడుస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతోంది. పేదరికంలో ఉన్న ఓబుళమ్మ కుటుంబానికి తక్షణ సహాయం అందించాలని స్థానికులు కోరుతున్నారు.

మైదుకూరు : కూలిన మట్టిమిద్దె గోడ

**చెరువుకు మరమ్మతులు చేయాలి : ఆర్‌డిఒ**

**ప్రజాశక్తి - గోపవరం**

తంగ్రపల్లి చెరువుకు లీకేజీలున్నట్లయితే వెంటనే మరమ్మతుల చేయిం చాలని ఇరిగేషన్ అధికారులకు ఆర్‌డిఒ చంద్రమోహన్ సూచించారు. మంగళవారం వర్షాల నేపథ్యంలో మండలంలోని తంగ్రపల్లి చెరువును తహశీల్దార్ శ్రీ భువన్‌రెడ్డి, ఎంఎస్‌ఒ, ఇరిగేషన్ డిఇతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా చెరువును పరిశీలించారు. నీటి ప్రవాహ మార్గాల శుభ్రత, చెరువు కట్ట మరమ్మతులు, నీటి నిల్వ సామర్థ్యం వంటి అంశా లపై సంబంధిత అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో నీటి నిల్వలను సురక్షితంగా భద్రపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. చెరువుల పునరుద్ధరణతో గ్రామాలకు సాగునీరు, పశువులకు తాగునీరు లభించి ప్రజలకు ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ ప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బద్వేలు : చెన్నంపల్లి చెరువును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే, అధికారులు

**ప్రమాద స్థాయికి చేరిన చెన్నంపల్లి చెరువు**

**ప్రజాశక్తి - బద్వేలు :** బద్వేల్ నియోజకవర్గంలో కురిసిన వర్షంతో చెన్నంపల్లి చెరువుకు భారీగా వరద నీరు చేరుతుండడంతో బద్వేల్ మాజీ విజయమ్మ మంగళవారం ఇరిగేషన్, తహశీల్దార్ ఉదయ భాస్కర్ రాజుతో కలిసి చెన్నంపల్లి చెరువును పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా భారీ వరద నీరు చేరి చెన్నంపల్లి చెరువు ప్రమాద స్థాయికి నిండిందన్నారు. వరద నీరు ఇంకా అధికంగా చేరితే చెన్నంపల్లి చెరువు కింది గ్రామాలైన పంగవాండ్లపల్లి, తొట్టిగారిపల్లి, బోవిల్ల వారి పల్లికు ఇబ్బందిగా ఉంటుందని, ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. అవసరమైతే గ్రామ సచివాలయాలను, ఇతర ప్రభుత్వ భవనాలను పునరావాస కేంద్రాలుగా ఏర్పాటు చేసి ప్రజలను అందులోకి తరలించాలని పేర్కొన్నారు. ప్రజలకు కావాల్సిన నిత్యావసర వస్తువులు అత్యవసర సేవలు ఎస్‌బివిఆర్ ట్రస్టు నుండి అందిస్తామన్నారు. పునరావాస కేంద్రాల్లో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు.

గోపవరం : చెరువును పరిశీలిస్తున్న ఆర్‌డిఒ చంద్రమోహన్

బద్వేల్ : పట్టణంలోని ఆంజనేయపురంలో ఉన్న డ్రెయినేజీ నిండి ఓ ఇంటిలోకి చేరిన నీరు

## సహాయక చర్యలపై దృష్టి సారించండి

### - కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

**ప్రజాశక్తి - కడప**

మొంథా తుఫాన్ నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండడంతో రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి మట్టంపై అప్రమత్తంగా ఉంటూ సహాయక చర్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. జెసిఅదితి సింగ్, జిల్లా స్థాయి అధికారులతో మంగళవారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎటువంటి ప్రాణ, ఆస్తి, పంట జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, అత్యవసర సహాయక చర్యలపై తగు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీవర్షాల కారణంగా జిల్లాలో అన్ని నదులు, రిజర్వాయర్లలో నీటి మట్టం పెరిగిందని, ఇంకా వరదనీరు పెరిగే అవకాశాలు ఉండడంతో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు. రిజర్వాయర్లు, చెరువులపై ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం అన్ని ప్రాజెక్టులకు అధికంగా వరద నీరు వచ్చి చేరుతుండడంతో అక్కడి ప్రాజెక్టు ఇంజినీరింగ్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను కూడా అప్రమత్తం చేయాలని, చెరువులకు గండ్లు పడకుండా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు నిరంతర నిఘా ఉంచాలని పేర్కొన్నారు. రెవెన్యూ డివిజన్ల వారీగా కంట్రోల్ రూములు, తాత్కాలిక పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. వరద సహాయక చర్యల కోసం ప్రత్యేక రక్షణ సిబ్బంది, రెస్క్యూ టీము, ఫైర్ సిబ్బంది, బోట్లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. జనరేటర్లు, మంచినీటి ప్యాకెట్లు, ఆహార ప్యాకెట్లు సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అన్ని రెవెన్యూ డివిజన్ల పరిధిలో పోలీసు, అగ్నిమాపక సిబ్బందితో పాటు రెస్క్యూ టీమ్ ను కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అత్యవసర సహాయ సమాచార నిమిత్తం కలెక్టరేట్ కార్యాలయంలోని కంట్రోల్ రూంతో పాటు కడప, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల ఆర్డీవో కార్యాలయాల్లో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ నెంబర్లను సద్వినియోగం చేసుకునేలా ప్రజలను అప్రమత్తం చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

**నేడు పాఠశాలలకు సెలవు**

మొంథా తుపాన్ నేపథ్యంలో జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలకు ఈ నెల బుధవారం ప్రభుత్వ సెలవు ప్రకటిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తర్వుల నిబంధనలున్ని పాఠశాలలు పాటించాలని పేర్కొన్నారు.

సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు మనోహర్, వెంకటసుబయ్య

## కార్మికులను తొలగిస్తే ఉద్యమిస్తాం

**ప్రజాశక్తి- కడప అర్బన్**

జిజిహెచ్ (రిమ్స్)లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను, సూపర్‌వైజర్లను తొలగిస్తే ఉద్యమిస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మనోహర్, ఆప్కాస్ రాష్ట్ర కార్యదర్శి వెంకట సుబ్బయ్య పేర్కొన్నారు. మంగళవారం జిజిహెచ్ సూపరింటెండెంట్ కె.ఎస్.ఎస్ వెంకటేశ్వ రరావుకు వారు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ జిజిహెచ్‌లో ఈనెల 1 నుంచి పద్మావతి శానిటేషన్ వర్కర్స్ కాంట్రాక్టు వారు సర్వీస్ ప్రొవైడింగ్ చేసేందుకు ప్రభుత్వం దగ్గర నుంచి అగ్రిమెంటు చేసుకున్నారని తెలిపారు. ఈ క్రమంలోనే గత 16 సంవత్సరాల నుంచి పనిచేస్తున్న శానిటేషన్ కార్మికులను, సూపర్‌వైజర్లను తొలగిస్తామని యాజమాన్యం తరఫున సురేష్ చెప్పడం దారుణమని పేర్కొన్నారు. కనుక సురేష్ పైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్తగా వచ్చిన కాంట్రాక్టర్ మ్యాన్ పవర్ ఎక్కువ కావాలనుకుంటే కొత్తవారిని తీసుకోలే తప్ప గతంలో పని చేసే వారిని తొలగిస్తామనడం సరైందని కాదన్నారు. ఎంఒయూ ప్రకారం కార్మికులకు వేతనాలు మంజూరు చేయాలని, పిఎఫ్, ఇఎస్ఐ ప్రతినెలా సక్రమంగా చెల్లించాలన్నారు. కార్మికులకు రావాల్సిన వీక్లీ ఆఫ్‌లు, సెలవులు తప్పనిసరిగా అమలు చేయాలని తెలియజేశారు. లేబర్ ఆక్ట్‌కు భిన్నంగా వేతనాలు ఇస్తే ప్రజాస్వామ్య పద్ధతిలో ఆందోళన చేయాల్సి వస్తుందని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆప్కాస్ జిల్లా అధ్యక్షులు పవన్, రిమ్స్ నాయకులు ఏసన్న, రాజమ్మ, పెంచలమ్మ, విజయ సుబ్బారావు, బాలాజీ రావు, మున్సిపల్ యూనియన్ సి. పి. రమణ శానిటేషన్ కార్మికులు, సూపర్‌వైజర్ పాల్గొన్నారు. గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్, సూపరింటెండెంట్, కె ఎస్ ఎస్ వెంకటేశ్వరరావు, ఆర్‌ఎంఒ ,వై.శ్రీనివాసులు, మాట్లాడుతూ ఈనెల 29న 11:30 గంటలకు జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రస్తుతం ఎవరిని తొలగించవద్దని మౌఖికంగా తెలియజేశారు.

## కూటమి ప్రభుత్వ పాలనలో అభివృద్ధి శూన్యం

**ప్రజాశక్తి - కడప**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలైనా గతంలో ఎన్నడూ లేని విధంగా రూ. 1.50 కోట్లు అప్పు చేసి ఆల్‌టైం రికార్డు సృష్టించిందని, అభివృద్ధి మాత్రం చేసింది ఏమీ లేదని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కడపలో జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అరచేతిలో వైకుంఠం చూపించగా, టిడిపి కూటమి ప్రభుత్వం కైలాసం చూపిస్తోందని ఎద్దేవా చేశారు. కూటమి పాలనలో రాష్ట్ర పరిస్థితి పెనం మీద నుండి నిప్పుల పొయ్యిలో పడ్డట్లు తయారైందని ఆవేదన వ్యక్తం చేశారు. వైసిపి ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అప్పుల, అరాచక, ఆటవిక, మధ్యం, గంజాయి, డ్రగ్,బ ానతుల ఆంధ్ర ప్రదేశ్‌గా చేసిందని విమర్శించారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరుతో రూ15485 కోట్ల అదనపు భారాన్ని విద్యుత్ వినియోగదారులపై మోపి వీరబాదుడు బాధిందన్నారు. మండలానికి నాలుగు మద్యం షాపులు, 40 బెల్ట్ షాపులు అన్న విధంగా మద్యం పాలసీ తయారైందని వాపోయారు. నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేల చొప్పున ఇస్తామని నిరుద్యోగ భృతి హామీ ఇప్పటి వరకు అమలు చేయాలన్నారు. ఆడబిడ్డ నిధి, ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు 50 ఏళ్లకే పింఛను, విద్యా లర్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి హామీలను పూర్తిగా విస్మరించిందని పేర్కొన్నారు. పైగా వైద్య కళాశాలలను ప్రయివేట్ పరం చేసి పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసిందని చెప్పారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు ప్రసాద్ గౌడ్, జిల్లా కార్యదర్శి భువన ఏకాదశి రెడ్డి , మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఫీక్, బిసి సెల్ జిల్లా అధ్యక్షులు కులాయప్ప, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి సుబ్బారెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సునీల్, అమర్నాథ్‌రెడ్డి, ఉత్తన్న, తోపిరెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి, చిన్నకోట్ల నాగరాజు, ఐచర్ రమణ పాల్గొన్నారు.

## ఉద్యోగుల డిమాండ్లను దశలవారీగా పరిష్కరిస్తాం : మంత్రి

**ప్రజాశక్తి - రాయచోటి అర్బన్ :** ఎపి ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను, డిమాండ్లను దశలవారీగా పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారని రాష్ట్రరవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డిని ఎపి ఎన్‌జిఒ సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల నూతనంగా ఎంపికైన ఎపి ఎన్‌జిఒ అన్నమయ్య జిల్లా అడ్ హాక్ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగులకు కొద్ది రోజుల కిందటకే ఒక డిఏ ప్రకటించామని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తాను అన్ని వేళ లా ముందుంటానని పేర్కొన్నారు. ఉద్యోగులు ప్రభుత్వం పథకాలను ప్రజలకు సకాలంలో అందించాలన్నారు. మొంథా తుపాన్ నేపథ్యంలో ఉద్యోగులందరూ ప్రజలకు అందుబాటులో ఉండి వర్షాల కారణంగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలంటూ కోరారు. మంత్రిని కలుసుకున్న వారిలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్, అన్నమయ్య జిల్లా ఆడ్ హాక్ కమిటీ ఛైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, ఉమ్మడి కడప జిల్లా అధ్య క్షులు శ్రీనివాసులు నిత్య పూజయ్య, అన్నమయ్య జిల్లా కన్వీనర్ శ్రీనివాసన్, రాయచోటి తాలూకా కార్యదర్శి మహాదేవ, కోశాధికారి దేవేంద్ర, శివారెడ్డి రవిశంకర్, మహబూబ్ బాషా, గంగాధర్ పాల్గొన్నారు.



మంత్రిని సన్మానిస్తున్న ఎన్‌జిఒ సంఘం నాయకులు

## ట్రెజరీ ఐడిలు కేటాయించాలి

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** ఇటీవల మెగా డిఎస్‌సి 2025 ద్వారా జిల్లాలో ఎంపికైన ఉపాధ్యాయులకు ఇంతవరకు ట్రెజరీ ఐడీలు కేటాయించలేదని, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్ బాష, సంగమేశ్వర్‌రెడ్డి కోరారు. మంగళవారం జిల్లా ఖజానా కార్యాలయంలో ఉపసంచాలకులు ఎం.ఎస్.వెంకటేశ్వర్లును కలిసి వివిధ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఎస్‌టియు నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా డిఎస్‌సి-2025 ద్వారా నూతనంగా ఉమ్మడి జిల్లాలో 672 మంది ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించిందని పేర్కొన్నారు. వారందరికీ ఎస్‌టిఒ పరిధిలో ట్రెజరీ ఐడిలు ఏర్పాటు చేసుకోవడానికి అవకాశం కల్పించాలని పేర్కొన్నారు. నూతనంగా ఉపాధ్యాయ వృత్తిలో వచ్చిన ఉపాధ్యాయులకు ట్రెజరీ ఐడిలు కేటాయించడంలో ఆలస్యం కావడం వల్ల ఉపాధ్యాయులకు నిరాశ కలుగుతుందని అన్నారు.

## అందరూ సురక్షితంగా ఉండాలి

**ప్రజాశక్తి-కలసపాడు :** తహశీల్దార్ మధురవాణి, ఎంపిడిఒ మహబూబ్‌బీ ఆదేశాల మేరకు సచివాలయ సిబ్బంది గ్రామాలలో తిరుగుతూ మొంథా తుపాన్ నేపథ్యంలో ప్రజలకు సూచనలు చేస్తూ, ఎటువంటి సంఘటనలు జరగకుండా అప్రమత్తం చేశారు. ఎగువ తంబళ్లపల్లి పంచాయతీలో మట్టి మిద్దెలు ఉన్న వారికి జాగ్రత్తలు చెప్పి, సురక్షిత ప్రాంతంలో ఉండాలని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ సిద్దేశ్వరరెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ మంత్రు నాయక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ యశ్వంత్ సాయి, డిజిటల్ అసిస్టెంట్ రాహుల్ సూచించారు.

## ప్రజా ఉద్యమాలను కొనసాగిస్తా

### - సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

**ప్రజాశక్తి - కడప అర్బన్**

ప్రజా సమస్యలపై ఉద్యమాలను కొనసాగిస్తానని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య పేర్కొన్నారు. నూతనంగా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన ఈశ్వరయ్యకు మంగళవారం నగరంలోని హరిత హోటల్లో అభినందన సభ సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పలు పార్టీల నాయకులు, వివిధ సంఘాల నాయకులు, పెద్ద ఎత్తున అభిమానులు, సిపిఐ నాయకులు ఆయన్ను అభినందించారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ చిన్నతనం నుంచి పోరాట పటిమనే ధ్యేయంగా దళిత, పేద, బడుగు వర్గాలకు విద్యార్థులకు, కార్మిక కర్షక రైతు సమస్యలపైన ఇప్పటి వరకు అలుపెరుగని పోరాటం చేశానో భవిష్యత్తో కూడా అదే పోరాట పటిమను అనుసరిస్తానని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంతో పాటు కేంద్రంలోని మోడీ, అమిత్‌షా కొనసాగిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తప్పుపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి, టిడిపి రాష్ట్ర నాయకులు హరి ప్రసాద్, సీనియర్ నాయకుడు అలంఖానపల్లె లక్ష్మీరెడ్డి, సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్, అన్నమయ్య జిల్లా సిపిఐ కార్యదర్శి మహేష్, వైసిపి బిసి నేత బంగారు నాగయ్య యాదవ్, ఎస్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి, సురేష్ బాబు, సుబ్రహ్మణ్యం రాజు, ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నాయకులు నరసయ్య, పలువురు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య

### షామీర్ హుస్సేన్‌ను పరామర్శించిన గౌస్‌పీర్

**ప్రజాశక్తి - కడప అర్బన్**

నగరంలోని ఆర్‌టిసి బస్టాండ్ సమీపంలో ఉన్న జెబి హాస్పిటల్‌లో నగరంలోని గౌస్ నగర్‌కు చెందిన 27వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి షామీర్ హుస్సేన్ చికిత్స పొందుతున్నారు. ఆయన్ను జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ గౌస్ పీర్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సయ్యద్ గౌస్ పీర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో షామీర్ హుస్సేన్ బాగా ఉత్సాహంగా పని చేస్తూ పార్టీకి సేవలు అందించడం ఎంతో అభినందనీయం అన్నారు. త్వరగా కోలుకుని పార్టీకి మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దాసరి శ్రీనివాసులు, ఫజలుల్లా, ముబారక్, సిద్దిక్ పాల్గొన్నారు.

షామీర్ హుస్సేన్‌ను పరామర్శిస్తున్న గౌస్‌పీర్

ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న తహశీల్దార్ బి.రామచంద్రుడు

## ఉల్లి కష్టాలు తీర్చాలని రైతులు ధర్నా

**ప్రజాశక్తి - తొండూరు**

ఆరుగాలం కష్టపడి పండించిన పంటపై ప్రకృతి పగబట్టి ముంచుతోంది. ధరలు లేవని వ్యాపారులు పంటను కొనుగోలు చేసేందుకు ముందుకు రావడంలేదు. ప్రభుత్వం ఆదుకోనక కల్లబొల్లి మాటలు చెబుతూ కాలయాపన చేస్తోందని పలు గ్రామాల ఉల్లి రైతులు వాపోతున్నారు. ఆ మేరకు మంగళవారం వారు రెవెన్యూ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. మండల పరిధిలోని గంగనపల్లె, భద్రంపల్లె రైతులు తహశీల్దార్ బి.రామచంద్రుడుతో మాట్లాడుతూ తమకు న్యాయం జరిగేలా ఉన్నతాధికారులతో మాట్లాడండయ్యా అంటూ తమ ఆవేదనను వెలుబుచ్చారు. వర్షంతో ఉల్లి పంట పూర్తిగా దెబ్బతిందని, ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. స్పందించిన తహశీల్దార్ మాట్లాడుతూ పంట నష్టాన్ని అంచనావేసి, నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామన్నారు. పరిస్థితిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

టిడిపిలో చేరిన వారితో బిటెక్ రవి

## వైసిపి నుంచి టిడిపిలో చేరిక

**ప్రజాశక్తి - లింగాల**

కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై అంకేవానిపల్లెకు చెందిన 40 కుటుంబాలు మంగళవారం వైసిపి నుంచి టిపిడిలో చేరాయి. వారికి టిడిపి పులివెందుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి బిటెక్ రవి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. చేరిన వారిలో బయన్న, శివ, రాజా, శివకుమార్ తదితరులున్నారు. అనంతరం బిటెక్ రవి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుడతామని తెలిపారు.

## టిడిపిలో చేరిన వారివల్ల వైసిపికి నష్టం లేదు

**ప్రజాశక్తి - లింగాల**

మండలంలో నాలుగు కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరడం వల్ల, ఆ విధమైన లోపాయకారీ ఒప్పందం చేసుకున్న వారివల్ల వైసిపికి వచ్చిన నష్టం ఏమీ లేదని వైసిపి లింగాల మండల కన్వీనర్ అంబకపల్లె బాబురెడ్డి పేర్కొ న్నారు. మంగళవారం సాయంత్రం ఆయన అంబకపల్లెలో స్వగృహంలో విలేక రులతో మాట్లాడారు. అంకెవానిపల్లె గ్రామానికి చెందిన నాలుగు కుటుంబాలు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి బీటెక్ రవి సమక్షంలో ఆ పార్టీలో చేరడంపై స్పందించారు. పార్టీలో చేరిన వారిలో ఎంపీటీసీ భీముడు గతంలోనే తెలుగుదేశం పార్టీ నాయకులతో లోపాయకారీ ఒప్పందం చేసుకున్న విషయం గుర్తు చేశారు. దీనికి తెలుగుదేశం పార్టీ వారు 40 కుటుంబాలు చేరినట్లుగా గొప్పలు చెప్పుకోవడం హాస్యాస్పదమన్నారు. పులివెందుల ప్రాంతంలో వైసిపికి కంచుకోట ఒక ఇంచ్ కూడా టిడిపి కదిలించలేదని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చి 17 నెలలు అవుతున్నా ఈ ప్రాంతానికి ఏ రకమైన అభివృద్ధి చేశారో చెప్పాలని ప్రశ్నించారు. టిడిపి నాయకులు కేవలం తమ ఉనికిని కాపాడుకునేందుకు మాత్రమే వైఎస్ కుటుంబం, వైసిపిపై బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డి పర్యవేక్షణలో పులివెందుల నియోజకవర్గం ఏ విధంగా అభివృద్ధి చెందిందో ఒక్కసారి గుండెల మీద చేయి వేసుకొని ఆలోచిస్తే తెలుస్తుందన్నారు.

అంబకపల్లె బాబురెడ్డి

అయ్యప్ప ఆలయ సమీపంలో సర్వీస్ రోడ్డుపై పంట ఉత్పత్తులు

## సర్వీస్ రోడ్లపై ఇలా.. ప్రమాదాలు జరిగితే ఎలా..!

**ప్రజాశక్తి - ఖాజీపేట**

కడప–కర్నూలు జాతీయ రహదారికి సంబంధించి పలుచోట్ల నిర్మించిన సర్వీస్ రోడ్లు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. జాతీయ రహదారి విభాగ అధికారులు సర్వీస్ రోడ్ల నిర్వహణను పట్టించుకోకపోవడం లేదన్న విమర్శలు ప్రజల నుంచి ఎక్కువగా వినిపిస్తున్నాయి. కొత్తపేట, పాటిమీద పల్లి, పుల్లూరు సమీపంలోని పూసల కొట్టాల వద్ద, కొత్త నెల్లూరు తదితర ప్రాంతాల్లో సర్వీసు రోడ్లు ఆక్రమణకు గురవుతున్నాయి. పశువులను కట్టి ఉంచడం, ధాన్యపు ఉత్పత్తులను ఆరబెట్టుకోవడం వంటి చర్యల వల్ల వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటివి కట్టడి చేయాల్సిన హైవే అధికారులు పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలకు అధికారులే ఆస్కారం ఇస్తున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## అఖిల భారత రెడ్డి సంఘంలో మహిళలకు ప్రాధాన్యత

**ప్రజాశక్తి - చాపాడు**

అఖిల భారత రెడ్డి సంఘం మహిళా విభాగంలో ముగ్గురిని వివిధ పదవుల్లో నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షులు జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలుగా జంగా శ్వేతారెడ్డి, కడప జిల్లా మహిళా అధ్యక్షురాలుగా కందుల వాసంతిరెడ్డి, గుంటూరు జిల్లా మహిళా అధ్యక్షురాలుగా కాసు కృష్ణచైతన్యరెడ్డిని నియమించామన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా సంఘంలో వారికి ప్రాధాన్యత కల్పిస్తున్నామన్నారు. మహిళాలు ఐక్యంగా ముందుకు సాగి, సమాజాభివృద్ధి దిశగా మరింత కృషి చేస్తారని మన స్ఫూర్తిగా ఆశిస్తున్నామన్నారు.

## ఆస్పత్రికి నిధులు మంజూరుపై సెక్రటరీతో ఎమ్మెల్సీ భేటీ

**వేంపల్లె :** వేంపల్లె ప్రభుత్వాసుపత్రి అసంపూర్తి భవనాల నిర్మాణం పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని మెడికల్ అండ్ హెల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి కోరారు. ఆ మేరకు ఆయన మంగళవారం విజయవాడలో ఉన్న మెడికల్ అండ్ హైల్త్ ప్రిన్సిపల్ సెక్రటరీ సౌరబ్ గౌర్‌ను ఆయన కలిశారు. భవనాలు అసంపూర్తిగా నిలిచిపోవడంతో రోగులకు అసౌకర్యంగా ఉందన్నారు. మైరుగైన వైద్య సేవలు అందడంలేదని వివరించారు. ఇందుకు స్పందించిన సౌరబ్ గౌర్ సానుకూలంగా స్పందించారని, నిధులు మంజూరుకు హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్సీ తెలిపారు.

# న్యాయం చేయండి సారూ..!

### వంద శాతం వికలత్వం - పుట్టుకతోనే పనిచేయని కాళ్లు, చేతులు - రూ.15 వేలు పింఛన్ ఇవ్వాలని వేడుకోలు

**పజాశక్తి - బ్రహ్మంగారిమఠం**

బి.మఠం మండలంలోని నరసన్నపల్లె గ్రామానికి చెందిన సన్నబోయిన ధనలక్ష్మికి పుట్టుకతోనే కాళ్లు, చేతులు పనిచేయవు. పాపకు 14 ఏళ్లు. వికలాంగురాలు ధనలక్ష్మికి పింఛన్ రూ.15వేలు అందాల్సి ఉంది. కూటమి ప్రభుత్వంలో కేవలం రూ.6వేలు ఇస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ధనలక్ష్మి తల్లిదండ్రులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం నెలకు రూ.15వేలు పింఛన్ ఇవ్వాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిన్నర దాటినా నిజమైన హర్వులకు పింఛన్‌లో కోత విధించి వారిని ఇబ్బందులకు గురి చేయడం సరికాదని పలువురు పేర్కొం టున్నారు. బోగస్ పింఛన్‌ల ఏరివేత కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం సదరం సర్టిఫికెట్లను పరిశీలించింది. ధనలక్ష్మికి వైద్య పరీక్షలనంతరం 100శాతం వికలాంగురాలని సర్టిఫికెట్ ఇచ్చారన్నారు. అయినా రూ.6,000పింఛన్ తోనే సరిపెట్టడం బాధాకరం. నిజమైన అర్హులకు కూటమి ప్రభుత్వం ఇలాగేనా న్యాయం చేయాల్సింది అని పలువురు విమర్శిస్తున్నారు. 2016లో కూడా తెలుగుదేశం ప్రభుత్వంలో సదరం సర్టిఫికెట్‌లో 100శాతం వికలాంగురాలని ధనలక్ష్మికి సర్టిఫికెట్ ఇచ్చారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తమకు న్యాయం చేయాలని ధనలక్ష్మి కుటుంబ సభ్యులు కోరుతున్నారు. బోగస్ సర్టిఫికెట్లతో పింఛన్లు పొందుతున్న వారి పని మూడుపువ్వులు.. ఆరు కాయలుగా ఉందనే విమర్శలున్నాయి. నిజమైన దివ్యాంగుల పరిస్థితి మాత్రం దయనీయంగా ఉంది. బోగస్ వారిని గుర్తించడంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పూర్తిగా విఫలమయ్యారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పరిశీలించి వికలాంగురాలు ధనలక్ష్మికి రూ.15వేలు పింఛన్ అందేలా చర్యలు తీసుకోవాలని తల్లి దండ్రులు, స్థానికులు కోరుతున్నారు.

మంచానికే పరిమితమైన సన్నబోయిన ధనలక్ష్మి

# తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తం

పైడిపాలెం రిజర్వాయర్‌ను పరిశీలిస్తున్న ఇరిగేషన్ శాఖ అధికారులు

**ప్రజాశక్తి - సింహాద్రిపురం**

తుపాన్ ప్రభావంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం మండలంలోని పైడిపాలెం రిజర్వాయర్‌ను గండికోట లిఫ్ట్ ఇరిగేషన్ ఇఇ శ్రీనివాసులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం ఆరు టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.14 టిఎంసిలు నీరు నిల్వ ఉందన్నారు. రిజర్వాయర్ స్థితిగతులపై ఉన్నతాధికారులకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామన్నారు. తుఫాన్ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇఇ సూచించారు. కార్యక్రమంలో డిఇ రామకృష్ణయ్య, ఎఇ ఈశ్వర్ పాల్గొన్నారు. భారీ తుఫాన్ నేపథ్యంలో ప్రజల అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి మురళి సూచించారు. మంగళవారం తుఫాన్ నేపథ్యంలో పునరావాస కేంద్రాలను ఆయన పరిశీలించారు. మట్టి మిద్దెలో నివసిస్తున్నవారు, గొర్రెల కాపరులు, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ రమాదేవి

**పులివెందుల రూరల్ :** తుఫాను హెచ్చరికల నేపథ్యంలో పులివెందుల పట్టణంలో ఎస్‌ఎసి బిల్డింగ్, వైఎస్ఆర్ ఇస్తా బిల్డింగ్‌లో రెండు పునరావాస కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తుఫాను ప్రభావంతో సంబంధించి నియోజవర్గం ప్రాంతాలను అధికారులతో కలిసి స్పెషల్ ఆఫీసర్, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవరు భయపడవలసిన అవసరం లేదన్నారు. 24/7 మీకు అందుబాటులో ఉంటామని తెలిపారు. ఏ సమస్య వచ్చినా టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేయవచ్చునని సూచించారు. ఎర్రబెల్లి చెరువు సంబంధించి వచ్చామన్నారు. అధికారులతో కలిసి ఎర్రబల్లె చెరువు, దాని పరిధిలో ఉన్న గ్రామాలను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ షేక్షావల్లి పాల్గొన్నారు.

సౌకర్యాలపై చర్చిస్తున్న అధికారులు

**ఖాజీపేట :** మొంథా తుపాను ప్రభావం కారణంగా పెన్నా నది పరివాహక ప్రాంత ప్రజల అవసరార్థం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను మంగళవారం డీఎల్డీవో మైథిలి, మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్, ఎంపీ డీవో దివిజాసంపతి, సీఐ వంశీధర్ పరిశీలించారు. త్రిపురవరం, కొమ్మలూరు గ్రామాల్లో పున రావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రజలు అప్ర మత్తంగా ఉండాలని, నదీ పరి వాహక ప్రాంతానికి వెళ్లవద్దని సూచించారు. అధికారులు ప్రజలకు అందు బాటులో ఉంటారని ఏమైనా సమస్య ఉంటే అధికారులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, పోలీసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

**దువ్వూరు :** తుఫాను వర్ష ప్రభావం వల్ల లోతట్టు ప్రాంతాలను తహశీల్దార్ సంజీవరెడ్డి పరిశీలించారు. పెద్దజొన్నవరం, జిల్లెల్ల, కానగూడూరు, నేలటూరు గ్రామాలలో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. సమీపంలో ప్రవహిస్తున్న కుందూ నది పరివాహక ప్రాంతాలను పరిశీలించి, ప్రజలకు ముందస్తు చర్యల గురించి వివరించారు. డిప్యూటీ తహశీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ జాన్సన్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

**చాపాడు :** మొంథా తుఫాన్ ప్రభావంతో మంగళవారం తెల్లవారుజాము నుండి వర్షం కురుస్తోంది. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు జరగకుండా అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపడుతున్నారు. లోతట్టు ప్రాంతాలు, వర్షాలకు దెబ్బతిన్న గృహాల్లో నివాసం ఉండేవారిని అప్రమత్తం చేస్తున్నారు. చాపాడు మండల పరిధిలో అల్లాడుపల్లె దేవళాలులోని టీటీడీ కల్యాణమండపంలో పునరావస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తహశీల్దార్ రమాకుమారి, సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు కుందూ నది ఉధృతంగా ప్రవహిస్తోంది.

**మైదుకూరు (రూరల్) :** పట్టణంలోని లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను మం డల ప్రత్యేక అధికారి సరస్వతి, తహశీల్దార్ రాజసింహా నరేంద్ర ఏర్పాట్లు పర్యవేక్షించారు. మున్సిపాలిటీ పరిధిలోని శెట్టివారిపల్లె చెరువును పరిశీలించారు. పాడుబడిన ఇళ్లల్లో ఉంటున్న వారిని అధికారులు అప్రమత్తం చేశారు. పట్టణంలో లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఇబ్బందులు కలగకుండా శాంతినికేతన్ హైస్కూల్లో పునరావస కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

మైదుకూరు రూరల్ : శెట్టివారిపల్లి చెరువు వద్ద పరిశీలిస్తున్న అధికారులు

# 40 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

దుంగలు, నిందితులతో డిఎఫ్ఒ వినీత్ కుమార్, సిబ్బంది

**ప్రజాశక్తి - వేంపల్లె**

రవాణాకు సిద్ధంగా ఉన్న 40 ఎర్రచందన దుంగలను స్వాధీనం చేసుకుని, ముగ్గురిని అరెస్టు చేశామని జిల్లా అటవీశాఖాధికారి వినీత్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక అటవీశాఖ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వేంపల్లె అటవీ రేంజ్ బోలగొంది చెరువు బీట్ పరిధిలోని గొరివి కనుమ అటవీ ప్రాంతంలో ఎర్రచందనం దుంగలను రవాణా చేస్తున్న స్మగ్లర్లపై దాడులు చేశామని తెలిపారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రవాణాకు సిద్ధంగా ఉన్న 40 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఎర్రచందనం రవాణాపై నిఘా పెట్టామన్నారు. అందిన సమాచారంతో వేంపల్లె ఎఫ్ఆర్ఓ పర్యవేక్షణలో అటవీ సిబ్బంది బోలగొంది చెరువు బీట్ ప్రాంతంలో కూబింగ్ చేపట్టార న్నారు. ఎర్రచందనం చెట్లను నరికి వాటిని దుంగలుగా మార్చి రవాణా చేసేందుకు సత్యసాయి జిల్లాలోని తలుపుల మండలం వ్యక్తులు సిద్ధం చేస్తుండగా దాడి చేశామన్నారు.వేములగొందికి చెందిన పోతలపల్లె మల్లికొండ, కాయలపల్లెకు చెందిన వీరాంజనేయులు, చినన్న వారిపల్లెకు చెందిన చెన్నకేశవును అరెస్టు చేశామన్నారు. కాయలపల్లెకు చెందిన కలువ పల్లె మనోహర్ నాయుడు అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని తెలిపారు. అతని కోసం గాలింపు చర్యలు చేపడుతున్నామన్నారు. ముగ్గురిపై కేసు నమోదు చేసి తిరుపతి కోర్టులో హాజరుపరుస్తామన్నారు. 40 ఎర్రచందనం దుం గలు విలువ రూ.2లక్షల13వేలు ఉంటుందన్నారు. దొరికిన ఎర్రచందనం దుంగలు సి గ్రేడ్‌కు చెందినవన్నారు. జిల్లా వ్యాప్తంగా 6 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. అక్రమ రవాణాపై ఎక్కువగా నిఘా పెట్టడంతో తగ్గు ముఖం పట్టిందన్నారు. ప్రతి ఫారెస్టు సిబ్బంది అటవీ ప్రాంతాల్లో గస్తీ చేస్తున్నట్లు చెప్పారు. అనుమాన వ్యక్తులపై, పాత నేరస్తులపై కూడా నిఘా పెట్టామన్నారు. టాస్క్‌ఫోర్స్, పోలీసు, ఫారెస్టు శాఖలు దాడులు చేస్తున్నట్లు వివరించారు. అడవి జంతువుల రక్షణపై కూడా ప్రత్యేకదృష్టి పెట్టినట్లు చెప్పారు. గతంలో చక్రాయపేట మండలంలో వన్య ప్రాణులను వెంటాడిన వ్యక్తులపై కేసులు నమోదు చేశామన్నారు. అనంతరం స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో వేంపల్లె ఫారెస్ట్ రేంజ్ అధికారి బాలసుబ్రమణ్యం, డిఆర్ఓ సుబ్బయ్య, బద్వేలు డిఆర్ఓ శేషయ్య, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ బివి సుబ్బయ్య, ఎబిఓ శ్రీనాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

## అత్యాధునిక చికిత్సల ద్వారా బ్లడ్ కేన్సర్ నయం

**- ప్రముఖ హెమటాలజిస్ట్, బిఎండి ఫిజిషియన్ డాక్టర్ గణేష్ జైషెట్వార్**

**ప్రజాశక్తి - కడప అర్బన్**

అత్యాధునికి చికిత్సల ద్వారా బ్లడ్ కేన్సర్ నయమవుతుందని హైదరాబాద్ యశోద హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ సీనియర్ హెమటాలజిస్ట్, బోన్ మారో ట్రాన్స్ ప్లాంట్ ఫిజిషియన్ డాక్టర్ గణేష్ జైషెట్వార్ అన్నారు. వైద్య విభాగానికి సంబంధించి నోబెల్ పురస్కారాలు ముగ్గురు శాస్త్రవేత్తలకు రావడం సంతోషకరమని పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని ఎర్రముక్కపల్లిలో ఉన్న హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ సమాచార కేంద్రంలో విలేకరుల సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య శాస్త్రంలో చేసిన విశేష కృషికి గాను ప్రముఖ శాస్త్రవేత్తలు మేరీ ఇ.బ్రున్‌కో, ఫ్రెడ్ రామ్స్ డెల్, షిమన్ సకాగుచీకి ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మక నోబెల్ పురస్కారం లభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కేన్సర్ వ్యాధిలో అనేక రకాలు ఉన్నాయన్నారు. అందులో రక్తంలో ల్యుకేమియా, లింఫోమా, మైలోమా అనే కేన్సర్లు వస్తాయన్నారు. మొదటి రెండు పిల్లలు, పెద్దలకు వస్తే, మైలోమా పెద్దవాళ్లలోనే ఎక్కువగా కనిపిస్తుందని పేర్కొన్నారు. హైదరాబాదులోని యశోద హాస్పిటల్స్‌లో అత్యాధునిక వైద్య చికిత్సలు అందిస్తున్నామని ఉమ్మడి కడప జిల్లా ప్రజలు వివరాలకు 98498 39806లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో హైదరాబాద్ యశోద హాస్పిటల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

**మహారాజశ్రీ ప్రొద్దుటూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు**

**O.S.No. 316/2023**

లెబాక గంగిరెడ్డి, S/o లెబాక వీరారెడ్డి, సాకిన గ్రామం డోర్‌నెం.5/101, కోగటం గ్రామం, కమలాపురం మండలం, కడప జిల్లా. ...వాది

Vs

బత్తుల వెంకట రమణ, S/o బత్తుల చెంచయ్య, సాకిన గ్రామం, డోర్‌నెం.3/680, వై.ఎమ్.ఆర్.కాలనీ, ప్రొద్దుటూరు టౌన్ & మండలం, కడప జిల్లా. ...ప్రతివాది

**సమన్లు**

పై నెంబరులోని వాది, ప్రతివాది అయిన నీపై, పై కోర్టు యందు దావా మొత్తం రాకోరి, పై దావాను దాఖలు చేసినారు. అట్టి దావా యందు నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న ఎడల పై కోర్టు యందు 09.12.2025వ తేదీన ఉదయం 10.30 ని॥లకు హాజరయ్యి ఆక్షేపణలు తెలుపవలెయును. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

**వాయిదా : 09.12.2025**

**T.PADMAJA, M.Com., L.L.B.,**
**Advocate,**
**PRODDATUR**

**మహారాజశ్రీ గిద్దలూరు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో**

**O.S.No. 214/2025**

బత్తుల పెద్ద రామయ్య. ...వాది

Vs

కామనూరి వెంకటరమణ. ...ప్రతివాది

ప్రతివాది అడ్రసు

కామనూరి వెంకటరమణ, టీచర్, S/o సుబ్బయ్య, H.No. 101/129, విశ్వనాథపురం, యరముక్కపల్లి పోస్ట్, చింత కొమ్మదిన్నె మండలం, వైఎస్ఆర్ కడప జిల్లా.

పై నెంబరు దావాలో మీ పై పరిహారం కొరకు వాది దావా దాఖలు చేసియున్నందున, మీకు సమను నిమిత్తము దావాను 31.10.2025వ తేదీకి వాయిదా వేసియున్నారు. కావున మీరు 31.10.2025వ తేదీన ఉదయం 10.30 గం॥లకు మీరు స్వయముగా గాని, మీ వకీలు ద్వారా గాని హాజర్రై సంజాయిషీ చెప్పుకోవలసియున్నది. లేనియెడల మీ పరోక్షమందు దావాను విమర్శించి, తీర్మానింపబడునని తెలియజేయుచున్నాము.

**వాయిదా తేది: 31.10.2025**

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

**కాకునూరి హిమశేఖర్ రెడ్డి**
అడ్వకేట్,
గిద్దలూరు, ప్రకాశం జిల్లా.

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

## అభిప్రాయ సేకరణపై సిపిఎం వినతి

**ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం**

బ్రహ్మంగారిమఠం దేవస్థాన పీఠాధిపతి నియామకం కోసం జరుగుతున్న అభిప్రాయ సేకరణలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.శివకుమార్, మండల కార్యదర్శి జి.సునీల్ కుమార్, వై.రాహుల్, అరవింద్, ప్రదీప్ తమ అభిప్రాయాన్ని వెలుబుచ్చారు. ఆ మేరకు మంగళవారం దేవాదాయ శాఖ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు కమిషనర్‌తో మాట్లాడుతూ వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా మొంథా తుపాను వల్ల భారీ వర్షాలు పడుతాయని అధికారులు సూచిస్తున్నారని, ఇలాంటి పరిస్థితుల్లో అభిప్రాయ సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం కంటే తుఫాను తర్వాత ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదని సూచించారు. రాష్ట్రం నలుమూలల నుంచి బ్రహ్మంగారి శిష్యులు, భక్తులు వచ్చి తమ అభిప్రాయాన్ని తెలియజేసే వీలుంటుందని సూచించారు.

## ఎన్నికలను తలపించిన పీఠాధిపతి ఎంపిక అభిప్రాయ సేకరణ

**ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం**

మఠం మఠాధిపతి నియామకంపై జరిగిన ప్రజాభిప్రాయ సేకరణ ఎన్నికలను తలపించేలా సాగింది. నాలుగేళ్ల వివాదానికి దేవాదాయశాఖ ధార్మిక పరిషత్ ముగింపునిచ్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాయి. మంగళవారం బ్రహ్మంగారిమఠంలో జరిగిన పీఠాధిపతి ఎంపిక నేపథ్యం సార్వత్రిక ఎన్నికను తలపించింది. గడచిన 11వ పీఠాధిపతి శ్రీవీరభోగ వసంత వెంకటేశ్వర స్వాములవారు శివైక్యం పొందాక 12వ పీఠాధిపత్యం కోసం తీవ్రమైన పోటీ నెలకొంది. ఆయనకు సంబంధించి ఇద్దరు భార్యల సంతానం ఈ పోటీని ఎదుర్కొంటున్నారు. మొదటి భార్య పెద్ద కుమారుడు వెంకటాద్రి స్వామి, రెండవ కుమారుడు భద్రయ్య స్వామి, రెండవ భార్య పెద్ద కుమారుడు గోవిందస్వామి, మధ్య పోటీ తీవ్రంగా ఏర్పడింది. రాష్ట్ర ప్రభుత్వం బ్రహ్మంగారి భక్తులు, మఠం మండల ప్రజలు, స్వామివారితో అభిప్రాయ సేకరణ చేపట్టింది. ముగ్గురు కుమారులకు సంభందించి భక్తులు, అభిమానులు పెద్దఎత్తున మఠం చేరుకొని వారి అభిప్రాయాలను తెలిపారు. వారికి మద్దతు తెలుపుతూ అర్జీ, ఆధార్ కార్డు జిరాక్స్ పత్రాలను భక్తులు అధికారులకు సమర్పించారు. ఉదయం 11 నుంచి ప్రారంభమైన అభిప్రాయ సేకరణ మధ్యాహ్నం మూడు గంటలకు ముగిసింది. కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉంటున్న భక్తులతో పాటు మండల ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. 11వ పీఠాధిపతి శ్రీవీరభోగ వసంత వెంకటేశ్వర స్వామి తనయుడు వెంకటాద్రి స్వామి మాట్లాడుతూ మఠం సంప్రదాయం, సనాతన ధర్మం ప్రకారం పీఠాధిపతి పదవి తనకే వరిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేవాదాయ శాఖ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ అభిప్రాయ సేకరణ కోసం మొత్తం దాదాపు 1600 మందికిపైగా హాజరయ్యారన్నారు. ప్రభుత్వానికి పూర్తి నివేదికను పది రోజుల్లో అందజేస్తామని వివరించారు. ఫలితాన్ని ప్రభుత్వం నిర్ణయిస్తుందని వెల్లడించారు. జిల్లా అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, డిసి పట్టం గురుప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణలో వైసిపి నాయకులు

## వైద్య కళాశాలల ప్రయివేటీకరణను ఆపాలి

**ప్రజాశక్తి - తొండూరు**

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను ఆపాలని వైసిపి నాయకులు మండల పరిధిలోని మల్లెల గ్రామంలో మంగళవారం ప్రతి ఇంటికి వెళ్లి సంతకాల సేకరణ చేపట్టారు. కోటి సంతకాల సేకరణను ముమ్మరంగా చేశారు. ముఖ్యఅతిథిగా వైసిపి మండల ఇన్‌ఛార్జి భూమిరెడ్డి రవీంద్రారెడ్డి హాజరయ్యారు. తాలుకా ప్రధాన కార్యదర్శి యాడికి ధశరథ రామిరెడ్డి, రజినీ కాంత్‌రెడ్డి, దాసరి శశికాంత్ రెడ్డి, అంకిరెడ్డి సురేష్ రెడ్డి(చంటి), వెంటరామిరెడ్డి, అగడూరు ఎంపీటీసీ కొప్పుల శివశంకర్‌రెడ్డి, సగబాల లక్ష్మిరెడ్డి, యాడికి బాబు, చల్లా రమేష్, కుడుముల మధుసూదన్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఖననం కోసం కష్టాలు

**ప్రజాశక్తి-కాశినాయన**

ఆ గ్రామంలో ఎవరైనా చనిపోతే మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లడానికి ప్రజలు అవస్థలు పడుతున్నారు. శ్మశానానికి దారి లేకపోడంతో నానా కష్టాలు పడుతున్నారు. మండల కేంద్రమైన నరసాపురం గ్రామంలోని దళితులకు శ్మశానానికి దారి లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. దళితులు వాపోతున్నారు. మంగళవారం గ్రామంలోని దళితవాడలో ఓ వృద్ధురాలు చని పోయింది. ఆమె మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లేందుకు దారి లేపోవడంతో అనేక ఇబ్బందులు పడ్డారు. శ్మశనికి వెళ్లాలంటే దారి పొడవునా ఏపుగా పెరిగిన ముళ్ళ పొదలు ఉన్నాయి. పైగా వంకను దాటి పోవాలి. అనేక ఇబ్బందులు పడుతూ వర్షంలోనే మృతదేహాన్ని శ్మశానానికి తీసుకెళ్లామని మృతురాలి బంధు వులు వాపోయారు. దళితవాడలో సుమారు 30 కుటుంబాలు నివాస ముంటున్నాయి. ఎన్నో దశాబ్దాల తరబడి శ్మశానానికి దారి లేదు. పలుమార్లు తమ సమస్యను అధికారులకు, పాలకులకు విన్నవించినా పట్టించుకో లేదని వాపోయారు. కనీసం కొంత దూరం గ్రావెల్ తోలి, ఒక పైపు కల్వర్టు వేస్తే సరిపోతుందని దళితులు కోరుతున్నారు.

**IN THE COURT OF THE HON'BLE PRINCIPAL JUNIOR CIVIL JUDGE, AT :: PRODDATUR**

**E.P. No. 82/2023**
**DRK No. 170/2018**

M/s. Kapil Chits (Hyderabad) Pvt. Ltd., represented by its Zonal Legal Officer, Y. Guru Sekhar ... D.Hr

Vs

V.Gopal S/o. Pullaiah, Hindu, aged about 55 years, working as watchman APSWR Junior College, Ramapuram,Resident of D.No. 38/304-14, Sriram Nagar Colony, Kadapa City & District. ... Jdr No.4

**నోటీసు**

పై కేసులోని డిక్రీ హోల్డర్ 4వ jdr ఐన మీ పైన అతనికి రావలసీన E.P మొత్తం ను రాబట్టుకోనుటకు మీ యొక్క లీవ్ శాలరీ జప్తు కోరుచు పై నెంబర్ E.P ని దాఖలు చేసి యున్నాడు. ఇందు విషయమై మీకు ఆక్షేపణలున్న యెడల పై కోర్టు నందు **12.11.2025వ** తేదిన **ఉ॥ 10.30 ని॥**లకు కుద్దున గాని, వకీలు ద్వార గాని హాజర్రై ఆక్షేపణలు తెలుపుకొనవలెను, లేని ఎడల సదురు విషయమై పరోక్షముగా విచారించి తీర్మణము చేయుదరని తెలియజేయడమైనది.

// కోర్ట్ వారి ఉత్తర్వు మేరకు //

వాయిదా 12.11.2025

**జింకా రవి**
అడ్వకేట్, ప్రొద్దుటూరు